



ర్యాలీ చేస్తున్న జర్నలిస్టులు



ధర్నాలో పాల్గొన్న జర్నలిస్టులు

కలం..
ఉద్యమ పిడికిలైంది..
వందల గళాల దళమై..
గర్జించింది..
మూకదాడిని
ముక్తకంఠంతో
ఖండించింది..
ప్రభుతను ప్రశ్నించింది..
నా స్వేచ్ఛను హరించే
హక్కు నీకెక్కడిదని..?
నా హక్కులను కాలరాసే
అధికారం
నీకెవరిచ్చారని?
పాలకులను
హెచ్చరించింది..
నియంతలనే
నిలువరించిన కలాన్ని
నేనని..
విధ్వంస రచనకు
వెరవనని..
బెదిరింపులకు
బెదరనని..
ప్రతిఘటనే
నా విధానమని..
ప్రతిఘటిస్తూనే
ఉంటానని..



ర్యాలీలో కర్నూలు జిల్లా నాయకులు



కడప జిల్లా నాయకులు

రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని జర్నలిస్టులు ఖండించారు. గురువారం చేపట్టిన చలో అనంతపురం కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు నేతలు వందలాదిగా తరలివచ్చారు. ర్యాలీ, ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. రాజకీయ, విద్యార్థి, ప్రజాసంఘాలు మద్దతుగా తరలివచ్చాయి.

7లో

ఎందుకీ కక్ష..?



టీచర్ ఉద్యోగంలో చేరే వారిపైనా కక్షసాధింపు

ధర్మవరం, ఫిబ్రవరి 22: వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పీఆర్సీ, డీఏతోపాటు మరికొన్ని ఆర్థిక బకాయిలు చెల్లించలేదు. చివరికి ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న ఏపీజీఎల్ఐ, పీఎఫ్ సొమ్ము కూడా ఈ ప్రభుత్వం వాడుకుందని ఆ వర్గాలు మండిపడుతున్నాయి. విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను మాత్రమే కాదు.. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారినీ వేధించేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్నో ఏళ్ల పోరాటాలతో రద్దు చేయించిన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో తాము సాధించుకున్న ఉద్యమ ఫలాలు నీరుగారుతున్నాయని ఉపాధ్యాయసంఘాలు మండిపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2024 నిర్వహణ కోసం జీఓ 56 విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యే అభ్యర్థులు కచ్చితంగా అప్రెంటీస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు అవాక్కయ్యాయి. పోరాట ఫలాలు బూడిదపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.


విద్యాశాఖలో మాత్రమే ఎందుకు...?



ఏళ్ల పోరాటాల ద్వారా అప్రెంటీస్‌ను రద్దుచేయించాం. మళ్లీ ఇప్పుడు ఆ విధానాన్ని తీసుకురావడం బాధాకరం. ఏ శాఖలోలేని విధంగా విద్యాశాఖలో మాత్రమే ఎందుకు అప్రెంటీస్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసిందో అర్థం కావడంలేదు. డీఎస్సీ రాసే అభ్యర్థులు అన్నిరకాల విద్యార్హతలు కలిగిన, ఉపాధ్యాయ శిక్షణ పొందినవారే. వారికి మళ్లీ అప్రెంటీస్ ఎందుకు?

- బీకే ముత్యాలప్ప, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్

అప్రెంటీస్ విధానం ఇలా..



రాష్ట్రంలో 1994 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా అప్రెంటీస్ విధానం అమల్లోకి వచ్చింది. 1995 జూన్ నుంచి విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మొదటి సంవత్సరం రూ.1200, రెండో ఏడాది రూ.1500 గౌరవవేతనం చెల్లించారు. స్కూల్ అసిస్టెంట్ స్థాయి వారికి మొదటి, రెండు సంవత్సరాలు రూ.1500, రూ.1800 గౌరవ వేతనం చెల్లించారు. దీనిపై ఉపాధ్యాయులు ఉద్యమించారు. 2008లో 13 రోజులపాటు సమ్మె చేశారు. దీంతో దిగివచ్చిన అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసింది. ఫలితంగా 2012 నుంచి అప్రెంటీస్ విధాన రహిత ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కొనసాగుతోంది. వీరందరికీ రెగ్యులర్ వేతనాలు చెల్లించారు. 2024 డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటీస్ విధానం తిరిగి అమలులోకి తేవడంతో ఉపాధ్యాయ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. ఇకమీదట ఉద్యోగాలు పొందే ఉపాధ్యాయులు రెండేళ్లపాటు అప్రెంటీస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. వీరికి మొదటి సంవత్సరం మూల వేతనంలో సగం, రెండో సంవత్సరంలో 60 శాతం చెల్లించనున్నారు. దీనికి ఎటువంటి అలవెన్స్, ఇతర పారితోషికాలు చెల్లించరు. ప్రభుత్వ నిబంధనల మేరకు అప్రెంటీస్ పూర్తిచేసిన వారిని మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తిస్తారు. వీరికి సెలవు సౌకర్యాల్లో కూడా కనీస పరిమితులు ఉంటాయి. ఉద్యోగ భద్రత ఉండదు. ఒక రకంగా ఇది వెట్టిచాకిరీనే. రెండేళ్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఉంటాయో.. ఉండవో.. కూడా ఇందులో పేర్కొనలేదు.

వేతనం ఇలా..

ప్రస్తుతం ఎస్జీటీల కనీస మూలవేతనం రూ.32,670, స్కూలు అసిస్టెంట్లకు రూ.44,570. కరువు భత్యం, ఇంటి అలవెన్స్ కలిపి ఎస్జీటీలకు రూ.44,559, స్కూల్ అసిస్టెంట్లకు రూ.60,790 లభించనుంది. 2024 డీఎస్సీ ఎస్జీటీలకు నెలకు రూ.16,335 మాత్రమే చెల్లిస్తారు. స్కూల్ అసిస్టెంట్లకు రూ.22,285 మాత్రమే ఇస్తారు. ఏడాదికి ఒక్కో ఎస్జీటీ రూ.3.40 లక్షలు, స్కూల్ అసిస్టెంట్ రూ.4.62లక్షలు నష్టపోవాల్సి ఉంటుంది. కొత్తగా డీఎస్సీలో చేరే ఉపాధ్యాయులు దీనిని గుర్తించాల్సి ఉంది. ఏళ్లపాటు ధర్నాల మొదలు ఆమరణ దీక్షలు, సమ్మెలు చేయడం ద్వారా అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయించుకుని నోషనల్ ఇంక్రిమెంట్లు కూడా ఉపాధ్యాయులు పొందారు. ప్రస్తుతం ఒక్కకలం పోటుతో తిరిగి అప్రెంటీస్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీంతో ఉపాధ్యాయ లోకం చేసిన ఉద్యమాలన్నీ బూడిదపాలయ్యాయని చెప్పాలి. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని ఉపాధ్యాయసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్యోగ భద్రత ఉండాలి



అలుపెరగని ఉద్యమాలతో సాధించుకున్న అప్రెంటీస్ రద్దు ఇక నీళ్లపాలే. 2024 డీఎస్సీలో రెగ్యులర్ వేతనాలు ఇచ్చేలా 56 జీఓ మార్చాలి. పోస్టుల సంఖ్య పెంచాలి. తక్షణ నియామకాలు చేపట్టాలి. ఓపీఎస్ వర్తించేలా నోటిఫికేషన్ సవరించాలి. గరిష్ఠ వయసు సడలించాలి. ఉద్యోగ భద్రత ఉండేలా నియామక ప్రక్రియ చేపట్టాలి.

- అమరా చంద్రబాబునాయుడు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు

తుక్కు దొంగలు!

కదిరి మున్సిపాలిటీలో అక్రమ తంతు

- గుట్టుగా తుక్కు ఎలక్ట్రికల్ సామగ్రి తరలింపు
- రూ.6 లక్షల సరుకు మాయం
- వెనక్కు తెప్పిస్తాం: డీఈ
- అలాంటిదేమీ లేదు: కమిషనర్



ఇంకా మిగిలి ఉన్న ఎలక్ట్రికల్ ఫిక్చర్లు



కదిరి మున్సిపాలిటీలో రాత్రికి రాత్రే తుక్కు కింద ఎలక్ట్రికల్ ఫిక్సర్లతోపాటు కొంత తుక్కును కూడా మాయం చేసినట్లు సమాచారం. ఈ తుక్కుకు కానీ, ఎలక్ట్రికల్ ట్యూబ్‌లైట్లు, ఫిక్సర్లకుగానీ వెలకట్టలేదు. టెండర్లు కూడా పిలువలేదు. మున్సిపాలిటీలోని సామగ్రిని మంగళవారం రాత్రికి రాత్రే అధికారులు మాయం చేసినట్లు సమాచారం. ఓ ప్రజాప్రతినిధి ప్రోద్బలంతోనే ఈ తంతు సాగినట్లు తెలుస్తోంది. మొత్తంమీద దాదాపు రూ.ఆరులక్షల విలువ చేసే సామగ్రి మాయమైనట్లు తెలిసింది. మిగిలిన ఫిక్సర్లను సైతం తరలించడానికి సిద్ధమవుతుండగా.. ఇంజనీరింగ్ అధికారులు అడ్డుకున్నట్లు సమాచారం. టెండర్లు పిలవకుండానే మున్సిపాలిటీ సామగ్రిని అడ్డగోలుగా అమ్మడం ఏమిటని పలువురు కౌన్సిలర్లు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- కదిరి

విలువ కట్టకుండానే..

మున్సిపాలిటీలో సాధారణంగా ఎలక్ట్రికల్ సామగ్రి విక్రయించాలంటే స్థానికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్లలో విలువ లెక్కించాలి. తరువాతే మిగతా కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. మున్సిపాలిటీలో రాత్రికి రాత్రే అమ్మేసిన ఎలక్ట్రికల్ సామగ్రికి సంబంధించి ఇంజనీర్లు మదింపు చేయనట్లు సమాచారం. రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా గుజిరీ యజమానులకు అమ్మినట్లు తెలిసింది. మొదటిలోడు వెళ్లిపోగానే సిబ్బంది మిగిలి ఉన్న వాటిని తరలించడానికి సమాయత్తమవుతుండగా విషయం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు తెలిసింది. వారు ఓ వివాహానికి హాజరై వస్తుండగా, ఈ తరలింపు జరిగినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన ఇంజనీరింగ్ అధికారులు మిగిలిన వాటిని తరలించకూడదని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో సామగ్రి తరలింపు తాత్కాలికంగా ఆగిపోయింది.

టెండరు పిలవకుండానే..

మున్సిపాలిటీలో ఏచిన్న పని చేపట్టాలన్నా, ఏది అమ్మాలన్నా టెండరు ప్రక్రియ తప్పని సరి. గతంలో ఓపెన్ టెండర్లు పిలిచేవారు. ప్రస్తుతం ఈటెండరు విధానం అమలు చేస్తున్నారు. మున్సిపాలిటీలో తుక్కుకానీ, ఇతర ఏ సామగ్రికానీ అమ్మాలంటే కనీసం ఓపెన్ టెండర్లు పిలవాల్సి ఉంది. మంగళవారం రాత్రి తరలించిన తుక్కుకు టెండర్లు పిలవనట్లు తెలిసింది. కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మున్సిపాలిటీ సామగ్రిని గుట్టుచప్పుడు కాకుండా అమ్మడానికే టెండర్లు పిలవలేదన్నది బహిరంగ చర్చ. టెండర్లు పిలిస్తే రూ.లక్షల్లో మున్సిపాలిటీకి ఆదాయం ఉంటుంది. టెండర్లు పిలవకుండా రాత్రికిరాత్రే తుక్కు తరలిస్తే వారికి మాత్రమే రూ.ఆరు లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు సమాచారం.

ఇంకెన్ని మాయం అయ్యాయో..?

మున్సిపాలిటీలో మంగళవారం రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా తుక్కుతోపాటు ఎలక్ట్రికల్ సామగ్రి తరలించారని బయటకు పొక్కడంతో ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎన్ని అక్రమంగా తరలించారో.. ఇలాంటివి ఎన్ని ఉన్నాయోనన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.



ఎలక్ట్రికల్ సామగ్రి (ట్యూబ్‌లైట్లు, ఫిక్సర్లు) తరలించగా మిగిలిన ఖాళీ స్థలం

వెనక్కు తెప్పిస్తాం

మంగళవారం రాత్రి ఎలక్ట్రికల్ సామగ్రితోపాటు తుక్కును తరలించినట్లు నా దృష్టికి వచ్చింది. వాటిని వెనక్కు తెప్పిస్తాం. మిగిలిన వాటిని కూడా టెండర్ ప్రక్రియ లేకుండా విక్రయించే ప్రసక్తే లేదు.

- విజయ్‌కుమార్, డీఈ, కదిరి మున్సిపాలిటీ

అలాంటిదేమీ లేదు

మంగళవారం రాత్రి ఎలక్ట్రికల్ సామగ్రిగానీ, తుక్కుగానీ తరలించలేదు. ఒక వేళ తరలించి ఉంటే వెనక్కు తెప్పిస్తాం.

- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

అందరికీ ఇళ్లు ఎక్కడిచ్చావు జగన్?



మహిళలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో అర్హులందరికీ స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తామని గొప్పలు పోయిన సీఎం జగన్.. ఎక్కడిచ్చారో చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా ఇళ్లు నిర్మించిన దాఖలాల్లేవన్నారు. మండలంలోని సీసీ కొత్తకోట గ్రామంలో గురువారం ఆయన బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. అందరికీ ఇల్లు హామీకే పరిమితమైందని విమర్శించారు. ఏగ్రామానికెళ్లినా ఇంటి పట్టాలు, ఇళ్లపై ఫిర్యాదు చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదవారికి ఇంటిపట్టాతోపాటు ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, గొట్లూరు శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, తలారి వెంకటలక్ష్మి, విజయసారథి, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు పాల్గొన్నారు.

- మాజీ మంత్రి పల్లె

జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలి



ప్రచారం నిర్వహిస్తున్న పల్లె

బుక్కపట్నం, ఫిబ్రవరి 22: ముఖ్యమంత్రి జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గోపాలపురం నుంచి ఆయన గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి, టీడీపీని గెలిపించాలని ప్రచారం చేశారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. ఇసుక, మద్యం, మట్టి, గ్రానైట్ మాఫియా, ముఠా రాజ్యం ఏలుతోందన్నారు. జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతినాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. అనంతరం పాముదుర్తి నుంచి రెడ్డిపల్లి వరకు రూ.2.90 కోట్లతో వేసిన తారు రోడ్డు శిలాఫలకం వద్ద ఆయన సెల్ఫీ దిగి, వైసీపీకి చాలెంజ్ విసిరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాలపురం గంగాధర్, సీనియర్ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, పల్లపు రవీంద్ర, లక్ష్మీనారాయణ, నారాయణ స్వామి, జగం వెంకటరాముడు, సయ్యద్, వాజీద్, తెలుగు యువత మురళి, తెలుగు మహిళ నేతలు లావణ్యగౌడ్, సాకే యశోద పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రభుత్వం కుచ్చుటోపీ

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మడకశిర టౌన్, ఫిబ్రవరి 22: నిరుద్యోగులకు వైసీపీ ప్రభుత్వం కుచ్చుటోపీ పెట్టిందని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయనీ, అధికారంలోకి వచ్చిన వెంటనే భర్తీ చేస్తామని నిరుద్యోగ యువతను నమ్మించి, మోసగించారన్నారు. ఏటా జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాననీ, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు. నాలుగేళ్లపాటు పోస్టుల భర్తీ ఊసెత్తలేదన్నారు. ప్రైవేటు ఉద్యోగాలు రాక, ప్రభుత్వ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగ యువత కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు ఖర్చు పెడుతూ మగ్గుతున్నారన్నారు. 57 నెలలు గడిచినా ఒక్క నోటిఫికేషన్ కూడా వదల్లేదన్నారు. జగన్‌కు ప్రభుత్వాన్ని నడపడం రాదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు నిబద్ధత ఉంటే గతంలో ప్రకటించిన మేరకు ఖాళీగా ఉన్నాయన్న పోస్టులన్నీ భర్తీ చేసి ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. లేనిపక్షంలో ఎన్నికలకు వెళ్లడానికి అనర్హులని మండిపడ్డారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరేందుకెళ్తే షర్మిలను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అక్రమ అరెస్టులను విడనాడాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంగులవాయిపాళ్యం ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వందశాతం పోలియో చుక్కలు వేయాలి: కలెక్టర్

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 23: జిల్లాలో వందశాతం పోలియో చుక్కలు వేయించాలనీ, ఇందుకు ఆయాశాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మార్చి 3న జిల్లావ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పల్స్ పోలియో నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లు, మారుమూల గిరిజన ప్రాంతాలు, జాతీయ రహదారుల పక్కన, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇటుక బట్టీలు, భవననిర్మాణ కార్మిక కుటుంబాలు పనిచేసే ప్రాంతాల్లో పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 3న పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు 4, 5 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేయాలన్నారు. పోలియో చుక్కలపై అపోహలు అవసరం లేదన్నారు. పోలియో చుక్కలు వేయించిన తర్వాత ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లావైద్యాధికారిని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 2.30 లక్షల పోలియో చుక్కల డోసులు జిల్లాకు వచ్చాయన్నారు. మొత్తం 11526 పోలియో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం 'ప్రతిసారీ రెండుచుక్కలు.. పోలియోపై నిరంతర విజయం' అనే పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ పాల్గొన్నారు.



పల్స్ పోలియో పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా వైద్యాధికారి తదితరులు

కలం.. గళం.. కదం..!



సంగమేశ్వర సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళుతున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు


కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

- దాడులపై జర్నలిస్టుల ఆగ్రహం
- తిరగబడేదాకా తెచ్చుకోవద్దని హెచ్చరిక
- చలో అనంతకు అన్నివర్గాల మద్దతు
- సీఎం జగన్ బాధ్యతారాహిత్యంపై నిలదీత



సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో అనంతపురం' నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. టీడీపీ, జనసేన, వామపక్షాలు, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, కుల సంఘాలు, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు, ఇతర జర్నలిస్టు సంఘాలు.. ఇలా ఒకరేమిటి.. అందరూ కలం శ్రామికులతో గళం కలిపి కదం తొక్కారు. ఫొటో జర్నలిస్టుకు మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నగరంలో నిర్వహించిన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొని.. ప్రజాస్వామ్య నాలుగో స్తంభానికి ఏర్పడుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల కార్యాలయాలపై దాడులను ముక్త కంఠంతో ఖండించారు. చూస్తూ ఊరుకునేది లేదని, తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. స్వయంగా పత్రికను నిర్వహిస్తున్న జగన్.. జర్నలిస్టుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని తప్పుబట్టారు. పద్ధతి మార్చుకోవాలని, వైసీపీ మూకలను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఆందోళనకు మద్దతుగా కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాల సహా.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది జర్నలిస్టులు తరలివచ్చారు.

పాలేగాళ్ల రాజ్యాన్ని తలపిస్తోంది



రాష్ట్రవ్యాప్తంగా మీడియా ప్రతినిధులపై దాడులు చేస్తూ వైసీపీ నాయకులు పాలేగాళ్ల రాజ్యాన్ని తలపిస్తున్నారు. సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను వైసీపీ మూకలు తరముకుంటూ వెళ్లి విచక్షణారహితంగా దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించడం అమానవీయం. ఇలాంటి దుర్మార్గపు దాడులను ఏ పార్టీ చేయలేదు. దాడిచేసిన వారిలో దాదాపు 20మంది పేర్లు బయటకువచ్చినా వారిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెనుకంజవేస్తున్నారు. ఇప్పటికైనా దాడిచేసిన వైసీపీ మూకలపై హత్యాయత్నం కేసు నమోదుచేసి జైలుకు పంపాలి. లేనిపక్షంలో ఎస్పీ, డీఐజీ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తాం. మీడియా ప్రతినిధులకు అన్నిరకాలుగా అండగా ఉంటాం.

- గోనుగుంట్ల సూర్యనారాయణ, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే. బీజేపీ నేత

జగన్ నాయకత్వంలోనే దాడి



రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి జగన్ నాయకత్వంలో జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఆ సభలో ఆయన ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే ఈ దుర్మార్గమైన చర్యకు పాల్పడ్డారు. దాడి వీడియో చూస్తుంటే ప్రతిఒక్కరూ బాధపడ్డారు. ఐదేళ్లలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయి. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. గత ప్రభుత్వాల్లో ఎప్పుడు జర్నలిస్టులపై దాడులు జరగలేదు. రాబోయే రోజుల్లో పవన్‌కళ్యాణ్ అనంతకు రాబోతున్నారు. ఈ విషయంపై ఆయన గట్టిగానే స్పందిస్తారు. జర్నలిస్టు మిత్రులు ఏ నిర్ణయం తీసుకున్నా.. ఏం చేసినా జనసేన పార్టీ అండగా ఉంటుంది.

- టీసీ వరుణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు


ర్యాలీగా కలెక్టరేట్‌కు వస్తున్న జర్నలిస్టులు


బైఠాయించి నిరసన తెలుపుతూ...

అనంతపురంఅర్బన్/విద్య/ప్రెస్‌క్లబ్/సెంట్రల్/కల్చరల్,ఫిబ్రవరి 22: చలో అనంతపురానికి ఏపీయూడబ్ల్యూజే పిలుపు ఇవ్వడంతో జర్నలిస్టులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కర్నూలు, కడప తదితర ప్రాంతాల నుంచి నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేకచట్టం తేవాలని డిమాండ్ చేశారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. నిరసనలో

తరలివచ్చిన జర్నలిస్టులు

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్, ఎలక్ట్రానియక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రసూల్, ఎలక్ట్రానిక్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డానియల్, ఐజేయూ సభ్యులు ప్రభాకర్‌నాయుడు, కొండప్ప, కే. నాగరాజు, నాయకులు చౌడప్ప, చలపతి, కేపీకుమార్, తిప్పేస్వామి, రమేష్, మల్లికార్జున, కంబగిరి, భూమిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, సుంకన్న, అంజి, సీపీఐ రాష్ట్ర నాయకులు జగదీష్, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, అజీజ్, జేఎం బాషా, వన్నూరు, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి, అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ముప్పూరి కృష్ణ, జనసేన పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి చలపతి, నాయకులు సదానందం, ఇమామ్ హుస్సేన్, మేదర వెంకటేష్, మురళీ, సంతప్, అశోక్, హరి, విజయ్, లాల్‌స్వామి, అనిల్, రమణ, సోము, మహేష్, మల్లి, బెస్త సేవా సంఘం నాయకులు చేపల హరి, చంద్రబాబు, నాగరాజు, శీనా, మారుతి, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాడులు సిగ్గుచేటు



జర్నలిస్టులపై వైసీపీ మూకలు దాడులు చేయడం సిగ్గుచేటు. సాక్షాత్తు సీఎం సిద్ధం సభలోనే శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడి చేసి చంపాలని చూడటం దారుణం. ఈ ఘటనపై సీఎం జగన్ నోరువిప్పాలి. సిద్ధం సభలో జరిగిన దాడికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. టీడీపీ తరఫున జర్నలిస్టులు చేసే ఉద్యమాలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం.

- గౌస్‌మొహిద్దీన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

ఓటమి భయంతోనే...



ఓటమి భయం పట్టుకొని సీఎం జగన్‌రెడ్డి జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్నారు. రాప్తాడు సిద్ధం సభలో జనంరాక తేలిపోవడంతో ఆ గుట్టు ఎక్కడ బయటపడుతుందోనని విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై తన అల్లరి మూకలు, రౌడీలతో దాడి చేయించారు. సభ ముగిస్తున్న సమయంలో చొక్కాలు మడతపెట్టి సిద్ధం... సిద్ధం అంటూ దాడులు చేయమని సీఎం జగన్‌రెడ్డే ఆ పార్టీ రౌడీలను ఉసిగొల్పారు. ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీసు యంత్రాంగం ఒక్కరిని అరెస్టు చేయడం చూస్తుంటే వీరి వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. వెంటనే ఎస్పీ ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి దాడికి పాల్పడిన ప్రతిఒక్కరినీ కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి.

- పెండ్యాల శ్రీలత, జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్

అండగా ఉంటాం...



ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు తరలిరావడం శుభపరిణామం. ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతోందో ప్రపంచానికి తెలియపరిచే జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు తెగబడటం మంచిపద్ధతి కాదు. వారి కొచ్చే చాలీచాలని జీతాలతో కుటుంబసభ్యులను సైతం పక్కన బెట్టి విధులు నిర్వహిస్తుంటారు. మంచి, చెడులను ఎప్పటికప్పుడు సమాజానికి చూపించి దిశానిర్దేశం చేసే శక్తి మీడియాకు ఉంది. అలాంటి వారి మీద రాజకీయ నాయకులు ఆ పత్రిక మనకు పనిచేయదు... ఈ పత్రిక మనకు పనిచేయదని దాడులకు పాల్పడటం జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులు అండగా ఉంటారు.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్

బెదిరింపులకు పాల్పడుతున్నారు



శ్రీకృష్ణ సౌమ్యుడు, మంచివాడు. తనపని తాను చేసుకొని వెళ్లేవాడు. అలాంటి వ్యక్తిని నిర్ధాక్షిణ్యంగా కొడుతుంటే అందరి కళ్లల్లో నీళ్ల తిరిగాయి. ప్రతిపక్షాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఇళ్ల వద్దకెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని చరిత్రలో ఎన్నడూ చూడలేదు. నన్ను ఎవరు ఏమీ చేయలేరనుకుంటే పొరబడినట్లే. ప్రభుత్వమే ఇలా వ్యవహరిస్తే సమాజంలో ప్రజలు ఏ విధంగా బతకాలి. మీడియా మిత్రులు దేశంలో ఏ మూలన ఏం జరిగినా మంచి, చెడులను ప్రజల ముందువుంచుతారు. అలాంటి మీడియా మిత్రులపై దాడి చేయడం దారుణం. ఈ పరిస్థితుల్లో అందరూ ఏకమై త్వరలోనే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి.

- పెద్దనగౌడ్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

దాడి ప్రీప్లాన్డ్‌గా జరిగింది



శ్రీకృష్ణపై దాడి ప్రీప్లాన్డ్‌గా జరిగింది. దీని వెనకాల పెద్ద కుట్ర దాగి ఉంది. దాడి జరిగిన సందర్భంలో పోలీసులు పట్టించుకోకపోవడం బాధాకరం. దాడి జరిగి ఐదు రోజులు గడుస్తున్నా ఒకరిని అరెస్టు చేసి మిగతా వారిని పట్టించుకోకపోవడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఇకపై జర్నలిస్టులపై దాడులు జరిగితే చూస్తూ ఊరుకునేదిలేదు.

- రమణయ్య, సీపీఐ నాయకులు

వెంటనే అరెస్టు చేయాలి..



శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేయాలి. దాడి చేసిన వారి ఫొటోలు, పేర్లు పత్రికల్లో అడ్రస్సులతో సహా వైరల్ అవుతున్నా పోలీసులు కేవలం ఒకరిని మాత్రమే రిమాండ్‌కు పంపడం బాధాకరం. పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలి. దాడి చేసిన ప్రతి ఒక్కరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలి.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు..



సీఎం జగన్ ప్రత్యక్షంగా దాడులకు దిగుతున్నారు. ప్రతిపక్ష పార్టీలపై ఏ విధంగా విమర్శలు చేస్తున్నాడో అదేవిధంగా ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఇతర పత్రికలు, టీవీ ఛానళ్లపై విమర్శలేకాకుండా దాడులు చేస్తున్నారు. శ్రీకృష్ణ సభ కవరేజ్‌కు వెళ్లాడు. అయితే వైసీపీ మూకలు పాత్రికేయుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ దాడిచేశారు. గీత, ఖురాన్, బైబిల్ సాక్షిగా పాలన చేయడం అంటే ఇదేనా జగన్. పత్రికలను, ప్రతిపక్షాలను విమర్శించడం కాదు. జగన్‌కు ఇంటి నుంచే వ్యతిరేకత వస్తోంది. అది గుర్తించాలి. పాత్రికేయులు వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నారు. వారిపై దాడులు చేయడం సరికాదు. ఆనాటి కమ్యూనిస్టు విశ్వేశ్వరరెడ్డి తన అనుచరుడైన ఎర్రిస్వామిని కాపాడాలని ప్రయత్నాలు చేయడం, దారుణం. ఆయనకు సిగ్గనిపించాలి. జర్నలిస్టుల రక్షణకు ఎల్లప్పుడూ ముందే ఉంటాం.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

జగన్ హఠావో.. జర్నలిస్టు బచావో..



సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో ఇసుక అక్రమాలపై వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు నమోదుచేశారు. జర్నలిస్టులు బచావో.. జగన్ హఠావో.. నినాదంతో ఐక్యంగా పోరాడాలి. లేనిపక్షంలో జర్నలిస్టుల ఉనికిని కాపాడుకోలేని పరిస్థితులు వస్తాయి. జర్నలిస్టులు సమస్యలపై ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటారు.

- శ్రీనాథ్‌రెడ్డి, ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడప

డీజీపీ, జగన్ బాధ్యత తీసుకోవాలి



శ్రీకృష్ణపై దాడులు చేసిన అందరిపై పోలీసులు క్రిమినల్ కేసులు కట్టాలి. జగన్ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే వైసీపీ నాయకులను రెచ్చగొట్టి దాడు లు చేయిస్తున్నారు. డీజీపీ వైసీపీ అల్లరి మూకలు చేసే అరాచకాలకు వత్తాసు పలుకుతున్నారు. మరో మూడు నెలల్లో సీఎం జగన్ జైలుకు.. డీజీపీ ఇంటికి వెళ్లడం ఖాయం. రాష్ట్రంలో ఫ్యాక్షనిస్టు తరహా పాలనను వైసీపీ చేస్తుండటం సిగ్గుచేటు. మీడియాపై దాడులు విరమించుకోవాలి.

- శ్రీరాములు, సీపీఐ నగర కార్యదర్శి

దాడి హేయం



శ్రీకృష్ణపై వైసీపీమూకలు దాడి చేయడం దారుణం. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తే దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది.

- వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ, అనంతపురం రూరల్ మండలం

మీడియా లేకుంటే మనుగడే లేదు..



మీడియా లేకుంటే రాజకీయ నాయకుల మనుగడే లేదు. కార్యక్రమాలను కవర్ చేసే వారిపై దాడులు చేయడం దుర్మార్గం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ సీఎంలు అయ్యారంటే మీడియా చేసిన ప్రచారం కాదా..? ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉన్న జర్నలిస్టులపై దాడులు మానుకోవాలి. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

- దేవళ్ల మురళి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి


దాడులు చేసేందుకు సిద్ధం



జర్నలిస్టులపై దాడులు చేసేందుకే సిద్ధం సభలు చేపట్టినట్టు అనిపిస్తోంది. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి జర్నలిస్టులను చాలా గౌరవించేవారు. అలాంటి నాయకుడి కుమారుడై ఉండి జర్నలిస్టులపై దాడులు చేయిస్తావా..? శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేయాలి.

- రామసుబ్బారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే కడప జిల్లా అధ్యక్షుడు

ఫ్యాక్షనిస్టు సీఎం అయితే ఇలాగే ఉంటుంది..



ఫ్యాక్షనిస్టు సీఎం అయితే పాలన ఇలాగే ఉంటుంది. మీడియాపై దాడులను ఏపీ రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోంది. ఈ ఐదేళ్ల కాలంలో మీడియాగొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బహిరంగ సభలో ఏకంగా సీఎం జగన్ మీడియా సంస్థల పేర్లు చెప్పి దాడులు చేయాలన్నట్టుగా హెచ్చరికలు జారీ చేస్తే ఆ పార్టీ కేడర్ దాడులకు తెగబడదా..? ఈ దాడులను ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలి.

- మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రత్యేక చట్టం తేవాలి



జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి అమలు చేయాలి. జగన్మోహన్‌రెడ్డికి కోడికత్తి శీను చిన్నపాటి గాటు వేసినందుకే ఐదు సంవత్సరాల పాటు శీనుకు బెయిల్ రాకుండా జైలులో ఉంచారు. వేలాదిమంది సమక్షంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులపై అదేతరహాలో బెయిల్ లేకుండా కఠినంగా జైలుశిక్ష విధించాలి.

- నాగేంద్రకుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారు..



మీడియా స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోంది. ఐదేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న దురాగతాలకు సమయం దగ్గర పడిందనేందకు ఇదే నిదర్శనం. మా సమస్యలపై పోరాడేటప్పుడు మీడియా మిత్రులు ఏ విధంగా స్పందించారో... మీ సమస్యలకు మా గొంతు తోడై అండగా ఉంటాం. ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడ సాధించే వరకూ పెన్షనర్ల సంఘం తరుఫున తోడుగా ఉంటాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఇంతపెద్దఎత్తున వచ్చి సంఘీభావం తెలపడం శుభపరిణామం.

-జయరామప్ప, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎమర్జెన్సీని తలపిస్తోంది



ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీని తలపిస్తోంది. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికృతచేష్టలు చేస్తున్నాయి. జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం దారుణమైన చర్య. విలేకరులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్లే. శ్రీకృష్ణపై దాడి అందరినీ కలచివేస్తోంది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే వైసీపీ అల్లరిమూకలు రెచ్చిపోయి దాడులకు దిగాయి. అక్షరం, కలంపై దాడి సమావేశం నిర్వహిస్తున్నాం. విజయవంతం చేయండి.

- పోతుల రాధాకృష్ణ, ఫర్ ది సొసైటీ వ్యవస్థాపకుడు

నిజాలు రాస్తే దాడులా..?



నిజాలు రాస్తే దాడులు చేస్తారా..? ఈ ప్రభుత్వ హయాంలో అవినీతి, రౌడీయిజం పెరిగింది. శ్రీకృష్ణపై విక్షణారహితంగా దాడులు చేయడం దుర్మార్గం. కర్నూలు ఈనాడు కార్యాలయంపైనా రాళ్లదాడికి తెగబడటం అన్యాయం. రాప్తాడులో ఎమ్మెల్యే దౌర్జన్యాలు, బెదిరింపులు కూడా అనేకం చూశాం. ఈ విషయాలను బయటపెడతారన్న దురుద్దేశంతోనే దాడులు చేస్తున్నారు. ఇది చాలా అరాచకం. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు వీటిని ఖండించాలి.

- సంతోష్ కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి, ఏఐవైఎఫ్

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు



వైసీపీ ప్రభుత్వం వచ్చాక జర్నలిస్టుల మీద దాడులు పెరిగాయి. సమాజంకోసం తమ ప్రాణాలు సైతం లెక్కచేయక జర్నలిస్టులు పాటుపడుతున్నారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ కూడా విధి నిర్వహణలో భాగంగానే సభకు వెళ్లాడు. ఆ సమయంలో ఒక్కడిని చేసి పైశాచికంగా మూకుమ్మడి దాడికి వైసీపీ మూకలు పాల్పడడం దుర్మార్గం. జర్నలిస్టుల ఉద్యమానికి పూర్తి మద్దతుగా నిలుస్తాం,

- నల్లప్ప, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

చర్యలు తీసుకోవాలి



శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ఈ దాడిని విద్యార్థుల రాజకీయ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. సమాజ హితంలో భాగంగా నిరంతరం సమాచారాన్ని సేకరించి ప్రజలకు అందించే పాత్రికేయులపై ఇలాంటి దాడులు చేయడం సబబుకాదు. మొన్న ఆంధ్రజ్యోతిపై, నిన్న ఈనాడుపై దాడులు చేయడం చాలా బాధాకరం.

- రామన్న, విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

ఎందుకు అరెస్టు చేయరు..?


సాకేహరి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీకృష్ణపై దాడిచేసిన వారిలో ఒకరిని మాత్రమే అరెస్టు చేసి మిగతావారిని ఎందుకు చేయడంలేదు. వారేమన్న వేరే దేశానికి పారిపోయారా..? దాడి సరైనదేనని నిందితులు వాట్సాప్ మెసేజ్‌లు పెడుతుంటే పోలీసులు ఎందుకు అరెస్టు చేయడంలేదు. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలి.

తిరుగుబాటు తప్పదు...

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. రానున్న రోజుల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు. వాస్తవాలను ప్రజల ముందుంచుతున్న జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం దారుణం. శ్రీకృష్ణపై దాడిచేసినవారు ప్రభుత్వానికి, పోలీస్‌శాఖకు ఎందుకు కనిపించడంలేదు. వెంటనే అరెస్ట్‌చేసి జైలుకు పంపాలి.

-వేమన, ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు

కఠిన చర్యలు తీసుకోవాలి


ఓతూరు పరమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

శ్రీకృష్ణపై వైసీపీమూకులు విచక్షణ కోల్పోయి చేసిన దాడి దారుణమైనది. అందరిపట్ల నిష్పక్షపాతంగా పాలన సాగిస్తామని ప్రమాణం చేసిన జగన్మోహన్‌రెడ్డి ఆ ప్రమాణాన్ని విస్మరించాడు. సీఎం కుర్చీని కాపాడుకోవడంకోసం దేనికైనా సిద్ధం అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు అమలు చేస్తే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు


రమణారెడ్డి, సామ్నా రాష్ట్ర కార్యదర్శి

జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిది. జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు పనిచేస్తుంటారు. వారిపై దాడులు చేయడం మానుకోవాలి. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. అలాచేస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి

కొత్తచెరువు, ఫిబ్రవరి 22: ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీమూకలు దాడిచేసి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు వారిని అరెస్టు చేయలేదని, దీన్నిబట్టి చూస్తుంటే ఇదంతా ప్రభుత్వమే చేయించిందన్న అనుమానం కలుగుతోందని టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను ప్రజలకు తెలియజేస్తున్న విలేఖరులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. జగన్ ఓటమి భయంతోనే మీడియాపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా దాడిచేసిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు.

పాఠశాలల సందర్శన

ధర్మవరం, ఫిబ్రవరి 22: రాష్ట్రస్థాయి లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పాఠశాల స్థాయిలో ఏవిధంగా ఇంప్లిమెంట్ అవుతుందో తెలుసుకోవడానికి రాష్ట్రస్థాయి బృందం జిల్లాలోని పలు పాఠశాలలను గురువారం సందర్శించారని ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ తెలిపారు. బత్తలపల్లి కేజీబీవీ, ధర్మవరం బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాల, కొత్తచెరువు మండలం కేశాపురం జిల్లా పరిషత్ పాఠశాల, పుట్టపర్తి మండలం జగరాశిపల్లి ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారన్నారు. లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌లో ప్రతినెలా విద్యార్థులు ప్రగతి సాధిస్తున్నారా లేదా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారన్నారు. అలాగే తరగతి గదిల్లో లోపాలను గుర్తించి ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ రీసోర్స్ పర్సన్లు శ్రీనివాసులు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ధర్మవరం, ఫిబ్రవరి 22: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అడుగుజాడల్లో ప్రతి విద్యార్థి నడవాలని పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాల హెచ్ఎం సీవీశేషు సూచించారు. అబ్దుల్‌కలాం వర్ధంతిని పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. కలాం ఇస్రో శాస్త్రవేత్తగా.. రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన బాటలో పయనించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 22: బీసీ సంక్షేమ సంఘం ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన బోగినేని మునీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలో మంగళవారం జరిగిన బీసీల ఆత్మీయ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసిన శంకర్ బాబు తనను నియమించి నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సంఘ నాయకుడికి నోటీసు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 22: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమం జరగనుంది. ఆ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా ఉపాధ్యాయ సంఘం నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసు అందించారు. గురువారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజంకు విజయవాడ వెళ్లకూడదని జమేదార్ వెంకటరాముడు నోటీసులు అందించారు. గౌస్‌లాజం మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాడే స్వేచ్ఛ కూడా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడికి చేయూత

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 22: ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతున్న కమ్మవారిపల్లి ఉపాధ్యాయుడు నేల కొటప్పకు పలువురు దాతలు చేయూతనందించారు. ఉపాధ్యాయుడు నిరుపేద కావడంతో చికిత్సల నిమిత్తం చింతమానుపల్లి సర్పంచ్ జగన్మోహన్‌చౌదరి రూ. 10వేలు, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి రూ.5వేలు, కొండకమర్లకు చెందిన అంగడి నాగరాజు, వెంకటనారాయణ, నాగేంద్రగుప్తా కలిసి రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం ఎంఈఓ సురేష్ ద్వారా గురువారం అందజేశారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకండి

తాడిమర్రి, ఫిబ్రవరి 22: తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. వారి ఆశయాలకు అనుగుణంగా చదవాలని విద్యార్థులకు ఎస్పీ మాధవరెడ్డి, మాజీ డీజీపీ జేవీరాముడు సూచించారు. మండలంలోని నార్శింపల్లిలో గురువారం జరిగిన జేవీఎం ఆర్డీటీ పాఠశాల వార్షికోత్సవానికి వారు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయి నాలుగో ర్యాంకు సాధించిన నిమీషా అనే విద్యార్థిని తల్లిదండ్రులకు రూ.25వేలు ఆర్థికసాయాన్ని జేవీఎం పాఠశాల తరఫున అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో రెండు, మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు, రూ.15వేలను అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో వైసీపీకి భారీ షాక్

● టీడీపీలోకి చేరిన ఆ పార్టీ కీలక నాయకులు



పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు



రెడ్డివారిపల్లిలో టీడీపీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పల్లె

ధర్మవరం, ఫిబ్రవరి 22: ధర్మవరం పట్టణంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఇటీవల మున్సిపల్ మాజీ చైర్మన్ వైసీపీని వీడి టీడీపీలోకి చేరగా.. తాజాగా 14వ వార్డుకు చెందిన కొందరు వైసీపీ కీలక నాయకులు చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో గురువారం వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కురుబ సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి వెంకటేశ్‌తో పాటు నగేశ్, యశ్వంత్, బాలకృష్ణ, హరి, సుబ్బు, సుబ్రహ్మణ్యం, అభి, సూరి, చలపతి, రాము, నారాయణస్వామి, సంతోష్, రాజేశ్, అశోక్‌తో పాటు మొత్తం 25 కుటుంబాల వారు చేరారు. వీరందరికీ పరిటాలశ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వైసీపీ పని ఎప్పుడో అయిపోయిందన్నారు. కేతిరెడ్డి పతనం కూడా ప్రారంభమై చాలా రోజులైందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వలసలు నియోజకవర్గంలో ఉంటాయని తెలిపారు. పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ... వైసీపీలో ఉన్న ఆధిపత్య పోకడలు, అక్కడి నేతలు వ్యవహరిస్తున్న తీరు నచ్చక టీడీపీలో చేరినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు.

రెడ్డివారిపల్లిలో 25 కుటుంబాలు చేరిక

నల్లమాడ: మండలంలోని చారుపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లిలో సుమారు 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి గురువారం రెడ్డివారిపల్లికి వెళ్లారు. అక్కడ ఆయన సమక్షంలో వైసీపీకి చెందిన 25 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లె వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో నారాయణరెడ్డి, గోపాల్, వీరనారప్ప, నారాయణస్వామి, శంకర్, శివ, గంగ, భాస్కర్, హర్షవర్ధన్, ఆంజనేయులు, రవినాయక్, భరత్, మోహన్‌రెడ్డి, రామాంజ నేయులు, లక్ష్మినారాయణ, మోహన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పది కుంటుంబాలు చేరిక

బుక్కపట్నం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ గోపాలపురంలో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టిన మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో పది కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కొత్తచెరువు మండలంలోని తిరుమలదేవరపల్లి, మైలేపల్లి గ్రామాలతో పాటు బుక్కపట్నం మండలంలోని క్రిష్ణాపురానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో వెంకటేష్, రవి, క్రిష్టప్ప, నారాయణస్వామితో పాటు పది కుటుంబాల వారు ఉన్నారు.

కందికుంట ఎన్నికల ప్రచారం ప్రారంభం

కదిరి, ఫిబ్రవరి 22: టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. తొలుత పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కందికుంటతో పాటు ఆయన సతీమణి కందికుంట యశోదమ్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని దేవళం వీధిలో ప్రారంభించారు. తర్వాత తలుపులకు చేరుకుని అక్కడి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనవాయితీ ప్రకారం నియోజకవర్గానికి ఈశాన్య దిశగా ఉన్న తలుపుల మండలం సంగటివారిపల్లిలో ప్రచారం ప్రారంభించారు. అక్కడ ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. వైసీపీ అరాచకాలకు, అక్రమాలకు స్వస్తి పలకాలంటే టీడీపీని గెలిపించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు పర్వీన్‌బాను, పవన్‌కుమార్‌రెడ్డి తలుపుల మండల కన్వీనర్ ముబారక్, మేడా శంకర్, కొమ్మినేని గంగయ్యనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగటివారిపల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట

వారంలోపు హంద్రీనీవాకు నీరివ్వాలి

కదిరి, ఫిబ్రవరి 22: నియోజకవర్గంలోని తలుపుల, ఎన్పీకుంట మండలాల దాహార్తి తీర్చే హంద్రీనీవా మెయిన్ బ్రాంచ్ కెనాల్‌కు వారంలోపు నీరు ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. తలుపుల మండలం కొరుగుట్టపల్లిలో గురువారం ఆయన హంద్రీనీవా కాలువ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబు ఏమి చేశారని ప్రశ్నిస్తున్నారని, ఇదిగో చంద్రబాబు చేసిన అభివృద్ధి అని హంద్రీనీవా బ్రాంచ్‌కెనాల్‌ను చూపించారు. వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన చేసి వదిలేస్తే.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు పూర్తి చేశామన్నారు. ఇప్పుడు వాటికి నీరు ఇవ్వకుండా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కుప్పానికి తరలించడమేమిటని ప్రశ్నించారు. మొదట కదిరి నియోజకవర్గానికి నీరు ఇచ్చిన తరువాతే ఇతర ప్రాంతాలకు ఇవ్వాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారంలోపు నీరు ఇవ్వాలన్నారు. లేకపోతే బలవంతంగా అయినా నీరు రప్పిస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అల్భా ముస్తఫా, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, బండార మనోహర్‌నాయుడు, ముబారక్, మేడా శంకర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన అనంతపురం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహిరంగ సభ జరగనుందని, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, పల్లంరాజుతోపాటు పలువురు సీనియర్ నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సభ ద్వారా కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తుందన్నారు. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులందరూ తరలిరావాలని కోరారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి షాన్వాజ్, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎస్పీ

పుట్టపర్తిరూరల్/ ముదిగుబ్బ: ఫిబ్రవరి 22: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బందినికి సూచించారు. అలాగే సార్వత్రిక ఎన్నికలు సమీస్తుండడంతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని ఆదేశించారు. జిల్లాలోని తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, ఏకపాదంపల్లి, మాల్యవంతం, ఆప్రాచెరువు, మంగలమడక, పట్నం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసు, పోలింగ్ అధికారులతో మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సౌకర్యార్థం మౌలికసదుపాయాలను తప్పక కల్పించాలన్నారు. ఇందులో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, భద్రతాపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐలు నాగస్వామి, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.



తాడిమర్రిలో పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

మార్కెట్‌లోకి హార్లీ డెవిడ్సన్



ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 22: ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్, హార్లీ డెవిడ్సన్ సంయుక్త ఆధ్వర్యంలో హార్లీ డెవిడ్‌సన్ ఎక్స్ 440 ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగర శివారులోని వివాహ భోజనంబు గార్డెన్‌లో గురువారం రాత్రి ఏర్పాటు కార్యక్రమంలో ద్విచక్ర వాహనాన్ని నరసింహ హీరో అధినేత సునీల్ రెడ్డి, హీరో మోటో కార్ప్ ఎఎస్ఎం దీపక్, టీఎస్ఓ హనుమా ఆవిష్కరించి కస్టమర్లకు అందించారు. మొదటి రోజు 18 వాహనాలను డెలివరీ చేసినట్లు వారు తెలిపారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.2,39,500 అన్నారు. హార్లీ డెవిడ్సన్ కంపెనీ బైక్ డ్రైవ్ చేయటం ప్రతి ఒక్కరి కల అన్నారు. అటువంటి బైక్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహా హీరో షోరూం జీఎం రాకేష్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తరచూ గొడవ పడుతున్నాడని భర్త హత్య

● మద్యం మత్తులో ఉండగా మెడకు టవల్ బిగించి చంపిన భార్య
● సీతారంపల్లిలో ఘటన



విశ్వనాథ్‌రెడ్డి (ఫైల్)

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి22: కుటుంబ కలహాలతో తరచూ గొడవ పడుతూ వేధిస్తున్నాడని ఆగ్రహం చెందిన భార్య మద్యం మత్తులో ఉన్న భర్తను టవల్‌తో గొంతు బిగించి చంపిన ఘటన మండలంలోని సీతారంపల్లిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ సీఐ ఆరోహణరావు గురువారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సీతారంపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి(35) చేనేత కార్మికుడిగా జీవనం సాగించేవాడు. ధర్మవరం పట్టణానికి చెందిన ధనలక్ష్మిని 10ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. గతంలో కూడా పోలీస్‌స్టేషన్‌లోనూ, పెద్దల సమక్షంలో వీరి పంచాయతీలు జరిగాయి. అయినా వారిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి విశ్వనాథ్ రెడ్డి పూటుగా మద్యం తాగి భార్యతో గొడవకు దిగాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె టవల్‌తో మద్యంమత్తులో ఉన్న భర్త గొంతు బిగించి ఊపిరి ఆడకుండా చేసింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు తెలపగా.. ఎస్ఐ నరేంద్ర, సిబ్బందితో వెంటనే గ్రామానికి చేరుకుని పరిశీలించారు. విశ్వనాథరెడ్డి మృతిచెందినట్లు గుర్తించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ధనలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

బైక్‌ను ఢీకొన్న అడవిపందులు

● భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



ఓబులేసు (ఫైల్)

బత్తలపల్లి, ఫిబ్రవవరి 22: మండలంలోని జ్వాలాపురం క్రాస్ సమీపంలో వెళ్తున్న బైక్‌ను అడవిపందుల గుంపు ఢీకొనడంతో భర్త మృతి చెందగా.. భార్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణానికి చెందిన ఓబులేసు, నాగమణి దంపతులిద్దరూ కలిసి బైక్‌లో బుధవారం మండలంలోని డీ చెర్లోపల్లికి వివాహానికి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే మార్గంమధ్యలోని జ్వాలాపురం క్రాస్ వద్దకు రాగానే వారి బైక్‌ను అడివి పందుల గుంపు ఢీకొట్టాయి. బైక్ అదుపు తప్పి కిందపడడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జ్వాలాపురం గ్రామస్థులు 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఓబులేసు పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగమణి చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 22: జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్టీయూ నాయకులు మండల కేంద్రంలో డీఈఓ మీనాక్షికి గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. పలువురు మాట్లాడుతూ మార్చి 18వ తేదీన జరిగే 10వ తరగతి పరీక్షలకు ఇన్విజిలేటర్ విధుల నుంచి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, గర్భిణులను, చిన్నపిల్లల తల్లులను, మెడికల్‌లీవులో ఉన్న వారిని మినహాయించాలని విన్నవించారు. అంతేకాకుండా గతంలో నిర్వహించిన స్పాట్ వాల్యుయేషన్‌లో రెమ్యునేషన్ కొంత మంది ఉపాధ్యాయులకు ఇప్పటికీ అందలేదని, వాటిని వెంటనే అందజేయాలని కోరారు. అలాగే జిల్లాలో నిలిచిపోయిన తెలుగు, ఇంగ్లిషు ఉపాధ్యాయుల ప్రమోషన్లను వెంటనే చేపట్టాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, కోనంకి చంద్రశేఖర్, నాయకులు గోపాల్‌నాయక్, ఆసిఫ్, ప్రసాద్, వెంగమనాయుడు తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో ఒరిగిందేమీ లేదు: బీజేపీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 22: వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, రాష్ట్ర నాయకుడు ఉత్తమరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. ప్రజాపోరులో భాగంగా మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం వారు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్ జగన్ అధికారంలోకి రాక ముందు ఎందరికో అనేక హామీలు ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ పూర్తిస్థాయిలో నేరవేర్చలేదన్నారు. అదీగాక అభివృద్ధి పనులు కూడా ఏమీ చేయలేదన్నారు. ముఖ్యంగా రైతులు పంటలు నష్టపోయి ఇబ్బందులు పడుతున్నా.. వారిని ఆదుకునే ప్రయత్నం చేయలేదన్నారు. నిరుద్యోగులను పట్టించుకోకపోవడంతో వారు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస బాట పట్టారన్నారు. కేంద్రం ఎన్నో అభివృద్ధి పనులు చేస్తే.. వాటికి జగన్ స్టిక్కర్లు అతికించుకుని తామే చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించి, బీజేపీని బలపరచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మండల అధ్యక్షుడు సున్నంపల్లి వెంకటరంగారెడ్డి, నాయకులు శ్రీనివాసులు, శేషాద్రినాయుడు, వెంకటరమణ, నాగప్ప, బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

గాండ్లపెంట, ఫిబ్రవరి 22: మండల వ్యాప్తంగా ఉన్న 24 పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో వంశీకృష్ణ గురువారం తనిఖీ చేశారు. అక్కడ మౌలిక వసతులైన నీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ర్యాంపులు తదితరాలను పరిశీలించారు. అన్ని వసతులు సక్రమంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సౌకర్యాలు కొరత ఉన్న కేంద్రాల్లో త్వరగా కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ రామానాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవి, వీఆర్వో చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి రఫీ తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయం

● భవిష్యత్తుకు గ్యారెంటీలో ధీమా వ్యక్తం చేసిన పార్టీ నాయకులు



ధర్మవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లిలో..



తాడిమర్రి మండలం ఏకపాదంపల్లిలో..



పుట్టపర్తిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న సామకోటి ఆదినారాయణ

ధర్మవరం, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో టీడీపీ తప్పక విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణాధ్యక్షుడు పరిశేసుధాకర్ ధీమా వ్యక్తంచేశారు. పట్టణంలోని 8,9వ వార్డుల్లో గురువారం వారు పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదేళ్లుగా అరాచకపాలన సాగుతోందన్నారు. ఈ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలకృష్ణ, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, అంబటిసనత్‌కుమార్, శీలామూర్తి, గరుగు వెంగప్ప, జిలకర శీన, కరెంటు ఆది, గోసలశ్రీరాములు, మారుతీస్వామి, రాళ్లపల్లి షరీఫ్, మాధవరెడ్డి, బడిగింజల రమణ, ఉస్మాన్, చెలిమిశివరాం, నాగేంద్ర, వాసుదేవ, వీర, కొత్తపేట బాబావలి, స్వర్ణకుమారి, మున్ని, నాగరత్న, మీనాక్షి, అఖిల, శారద తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో కానరాని అభివృద్ధి

బత్తలపల్లి: జగన్ సీఎం అయినప్పటి నుంచి రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని వెంకటగారిపల్లి, అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి గ్రామాల్లో వారు బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరిస్తూ.. వాటికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. తర్వాత పలువురు మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో పయనించాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. ఇందుకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, జక్కంపూటినాగభూషణ, గంటాపురం జగ్గు, సాంబ, మందల శ్రీనివాసులు, సురేంద్రనాయుడు, నారాయణస్వామి కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే బీసీల అభ్యున్నతి

పుట్టపర్తిరూరల్: తెలుగుదేశంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. పట్టణంలో ఆయన కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా బీసీల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేస్తుందని అన్నారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. తొలుత స్థానిక సత్యమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకర్తలు కేశప్ప, చిన్నయ్యపుట్లదొడ్డెప్ప, అర్జున్, అంజి పాల్గొన్నారు.

ఏకపాదంపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచతూ మినీమేనిఫెస్టో పథకాలు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, జిల్లా కార్యదర్శి పతకమూరి జనార్దన్, టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష, నాయకులు కొడిదెల శేఖర్, ఆదినారాయణ, సాయి, ఆత్మకూరు శ్రీనివాసులు, యల్లప్ప, రమణ, శ్రీనివాసరెడ్డి, రామానాయుడు పాల్గొన్నారు.

పేట వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 22: పట్టణ పరిధిలోని ప్రసిద్ధ పేటవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. గోవిందనామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

రేపటి నుంచి రంగనాథస్వామి ఉత్సవాలు

అగళి, ఫిబ్రవరి 22 : మండలకేంద్రానికి కర్ణాటక సరిహద్దులోని మాగోడి కంబద రంగనాథస్వామి ఉత్సవాలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం గంగ స్నానం, 25న గరుడ మహోత్సవం, 26న మధ్యాహ్నం 12గంలకు రథోత్సవం ఉంటాయని తెలిపారు. 27న ఆంజనేయస్వామి మహోత్సవం, 28న తలనీలాల సమర్పణ, 29న అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక , ఆంధ్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. భక్తులు స్వామికి పూలహారాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

25న వైద్యశిబిరం

పెనుకొండ, ఫిబ్రవరి 22 : జనవిజ్ఞానవేదిక పెనుకొండ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 10గంటలకు మూర్ఛవ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జేవీవీ అధ్యక్ష, కార్య దర్శులు ఇమ్రాన్, నబీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో ఆదివారం ఉదయం శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పెనుకొండ పట్టణం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 9491355200, 9398913631ను సంప్రదించాలని వారు తెలిపారు.

పొలానికి నిప్పు



కాలిపోయిన కొబ్బరి చెట్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని నాగలూరులో వ్యవసాయ పొలానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. పెనుకొండ పట్టణానికి చెందిన హోటల్ చంద్రకు చెందిన మూడెకరాలు, ప్రకాశ్‌కు చెందిన రెండెకరాల నాగలూరు వ్యవసాయ పొలాల్లో టెంకాయచెట్లు, అల్లనేరెడు చెట్లు సాగుచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు సమీపంలో ఎండుగడ్డికి నిప్పంటించడంతో మంటలు వ్యాప్తిచెంది పొలంలో ఉన్న డ్రిప్ పరికరాలు, పైపులు, 120కొబ్బరి చెట్లు, 20అల్ల నేరెడు చెట్లు కాలిపోయాయన్నారు. దీంతో దాదాపుగా రూ.2లక్షలు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు చంద్ర, ప్రకాశ్ వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

గుడిబండ, ఫిబ్రవరి 22 : మండలంలోని కేఎన్ పల్లికి చెందిన మాళమ్మ అనే మహిళ ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఉన్నట్టుండి మంటలు చెలరేగి ఇంట్లోని సామాగ్రి, వస్తువులన్ని కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

మహిళ ఆత్మహత్య



షబానా (ఫైల్)

గోరంట్ల, ఫిబ్రవరి 22: మండలంలోని మల్లాపల్లికి చెందిన మహిళ షబానా (26) ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకుంది. మల్లాపల్లికి చెందిన చాంద్ బాషా గోరంట్లలో చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య షబ్బానా, కుమార్తెలు రీనాజ్, మదీహా, ఆసీఫ్‌తో కలిసి గ్రామంలోనే నివాసముంటున్నాడు. షబానా కొంతకాలంగా థైరాయిడ్ సమస్యతో బాధపడుతుండగా ఇటీవల ఆపరేషన్ చేయించినట్లు బంధువులు తెలిపారు. ఆరోగ్యం కుదుటపడక పోవడంతో, బాధ భరించలేక ఆమె గురువారం తెల్లవారు జామున ఇంట్లోని పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంతసేపటికి గుర్తించిన భర్త ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ డాక్టర్ ఉష పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అయితే చాంద్‌బాషా తండ్రి ముస్తఫా, తమ్ముడు దాదులు ఆరేళ్ల కిందట మల్లాపల్లిలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతిచెం దారు. ఇప్పుడు భార్య మరణంతో ముగ్గురు ఆడపిల్లల బాధ్యత చాంద్‌బాషాపై పడిందని గ్రామస్థులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్యపై అలిగి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 22: ఓడీసీ మండలంలోని పగడాలవారిపల్లికి చెందిన బాలరాజు భార్యపై అలిగి మనస్తాపంతో గురువారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాలరాజుకు ఒకటిన్నర నెల కిందట వివాహమైంది. భార్యభర్తల మధ్య వివాదం తలెత్తి ఘర్షణపడినట్లు బంధువులు తెలిపారు. దీంతో బాలరాజు మనస్తాపం చెంది విషద్రావకాన్ని తాగాడు. అస్వస్థకు గురైన బాలరాజును కుటుంబసభ్యులు ఆటోలో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

ప్రశ్నించే గళమంటే జగన్‌రెడ్డికి వణుకు : బీకే



విలేకరులతో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, ఫిబ్రవరి 22 : ఓటమితో పాటు పరాభవం ఖాయమని తెలిసే ఉద్దేశ్య పూర్వకంగా మీడియా సంస్థల ప్రతినిధులపై వైసీపీ రౌడీ మూకలతో జగన్‌రెడ్డి దాడులు చేయిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి తీవ్రంగా విమర్శించారు. ఆయన గురువారం సాయంత్రం పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి ప్రతిసభలోనూ ఆంధ్రజ్యోతి మరోపత్రిక, చానల్ పేర్లను స్మరించుకోకుండా సభ ముగించడం లేదంటే వాటిపై ఆయనకు ఎంత అక్కసు ఉందో అర్థం అవుతోందన్నారు. చొక్కాలు మడతబెట్టండంటూ జగన్‌రెడ్డి సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే వైసీపీ కార్యకర్తలు మీడియా సంస్థలపై దాడులకు దిగుతున్నాయన్నారు. నియంతలకు, నియంతృత్వపాలనకు ప్రజాస్వామ్యంలో చోటులేదన్నారు. అలాంటివారు కాలగర్భంలో కలిసిపోక తప్పదన్నారు. పత్రికలపై దాడిచేయమని జగన్‌రెడ్డి ఉసిగొలుపుతున్నారంటే రాబోయే రోజుల్లో ఆయన సొంత పత్రికా విలేకరులకు భద్రత లేకుండా చేస్తున్నట్లే అన్నారు. జగన్‌రెడ్డి అవినీతి అక్రమాలను భాగోతాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్నారని మీడియాపై దాడులు చేస్తున్నారన్నారు. మీడి యాపై దాడి అంటే ప్రజాస్వామ్యం గొంతునొక్కే ప్రయత్నమేనని అందుకే ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, సాయికళ్యాణ్, నరేష్, అశ్వర్థ, జిరాక్స్‌సీన, వెంకటేశ్, గంగిరెడ్డి, పిల్లా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషి ఫలితమే కియ

శిక్షణ కేంద్రం వద్ద సవిత సెల్ఫీ చాలెంజ్



కియ శిక్షణకేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న సవిత

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 22 : జిల్లాలో అంతర్జాతీయ కియ కార్లపరిశ్రమను నెలకొల్ప డంతో నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి పొందుతున్నారని, అది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలితంతోనే సాధ్యమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలోని కియ ఇండస్ట్రియల్ శిక్షణ కేంద్రం వద్ద సవిత సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాళ్లగుట్ట ఉన్న భూముల్లో అంతర్జాతీయ కియ కార్లపరిశ్రమ ఏర్పాటుకు చంద్రబాబు ఎంతో కృషిచేశారన్నారు. అలాగే యువతలో నైపుణ్యం పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటుచే శారన్నారు. అందులో ఎంతోమందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించి, వారి బంగారు భవిష్యత్తుకు కృషిచేసింది చంద్రబాబే అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు పరిశ్రమలు ఏర్పాటు కావాల న్నా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందని అటువంటి నాయకుడిని మనం ఎన్నుకోవాలని తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రచారం కోసం సవిత చైతన్యరథం



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 22 : వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవిత చైతన్యరథం ఏర్పాటు చేసుకున్నారు. ఆమె గురువారం పట్టణంలోని మడకశిర రహదారిలో ఉన్న తన వ్యక్తిగత కార్యాలయానికి, చైతన్య రథానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడు తూ.... తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టోను, ఐదేళ్లలో వైసీపీ చేసిన అక్రమాలు తదితర వాటిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, మాజీ జడ్పీటీసీ వెంకటరాముడు, నాయ కులు మాధవనాయుడు, త్రివేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలి

పోలీసులకు పాత్రికేయుల ఫిర్యాదు



ఏఎస్ఐ జయలలితకు ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

హిందూపురం, ఫిబ్రవరి 22 : రాప్తాడు వద్ద ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని పరిగి మండల పాత్రికేయులు డిమాండ్ చేశారు. పాత్రికేయులు శ్రీనివాస రెడ్డి, గిరీష్, మూర్తి, హరి గురువారం పరిగి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ జయలతకు ఫిర్యాదు అందజేశారు. అనంతరం పాత్రికేయులు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా వైసీపీ అల్లరి మూకలు దాడిచేసి ఐదు రోజులవుతున్నా నిందితులు దర్జాగా తిరుగుతున్నా రని అన్నారు వారిని పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. పాత్రికేయులపై దాడిచేయడమంటే ప్రజాస్వామ్యంపై దాడిచేయడమేనన్నారు.

గుంతలను పూడ్చిన విద్యాశాఖాధికారులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని కురుబవాండ్లపల్లిలో ని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను గురువారం పూడ్చివేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ నాగమూర్తి వారం రోజుల కిందట ప్రహరీని ధ్వంసం చేసి పాత ప్రహరీ నుంచి పది మీటర్ల వెనక్కు నిర్మించేందుకు పాఠశాల ఆవరణంలో గుంతలు తీశారు. ఈ క్రమంలో పాఠశాల ప్రాంగణంలో తీసిన గుంతలతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, గుంతలను పూడ్చాలని విద్యాశాఖాధికారులు సర్పంచ్‌కు తెలిపారు. అయితే అతడు పట్టించుకోకపోవడంతో ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ పాఠశాలకు చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతలను పూడ్చించారు. పాఠశాల ప్రహరీని నిర్మించాలని సర్పంచ్ నాగమూర్తికి నోటీసులు అందించినట్లు తెలిపారు.

బావను చంపిన బావమరిది

హిందూపురం, ఫిబ్రవరి 22: మాటా మాటా పెరిగి బావమరిది కర్రతో తలపై బాదడంతో అతడి బావ అక్కడికక్కడే కూలిపోయి మృతి చెందాడు. హిందూపురం అప్‌గ్రేడ్ ఎస్ గౌరిశంకర్ తెలిపిన మేరకు.. పట్టణంలోని కట్టకింద ప్రాంతానికి చెందిన నారాయణస్వామికి పూలకుంట ఎస్సీ కాలనీకి చెందిన అలివేలి అనే మహిళతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. అయితే అతడు తరచూ పూలకుంటకు వెళ్లి గొడవ పడే వాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కూడా బావమరిది హరీష్‌తో గొడవ పడ్డాడు. ఈ తరుణంలో ఇద్దరి మధ్య మాటా మాట పెరిగింది. దీంతో హరీష్ తన బావ నారాయణ స్వామి తలపై కర్రతో బాదడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. కుటంబ సభ్యులు చూసే సరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హరీష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

స్పెషల్ టీమ్ దాడులు

లేపాక్షి, ఫిబ్రవరి 22 : జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో మండల కేంద్రంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో బుధవారం రాత్రి స్పెషల్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. కంచిసముద్రం గ్రామం వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న సోమందేపల్లి మండలం తుంగోడు గ్రామస్థులు ఇద్దరిని అరెస్టు చేసి, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు చలి వెందుల గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి, తొమ్మిది కర్ణాటక మద్యం ప్యాకెట్లను, బసవనపల్లికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని, ఏడు బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారిపై కేసు నమోదుచేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

పార్టీ అభ్యర్థిగా ఎవ్వరినీ ప్రకటించలేదు

టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు పార్థసారథిరెడ్డి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 22: తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఎవరినీ ఆ పార్టీ మడకశిర నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించలేదని, సోషల్ మీడియాలో వచ్చే వార్తలను చూసి నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురి కావద్దని టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ పార్థసారథిరెడ్డి అన్నారు. ఆయన గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేసిన వారిని విస్మరించరని అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకుని.. నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకే నిర్ణయం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిమతం మేరకు అధిష్టానం మడకశిర నియోజకవ ర్గం అభ్యర్థిని ప్రకటిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం త్రికరణ శుద్ధితో పనిచేస్తూ వైసీపీ అవినీతి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికి తప్పక న్యాయం జరుగుతుందన్నారు. కొందరు ప్రతిపక్ష నేతలు టీడీపీ నాయకులు, కార్యకర్తలను గందరగోళానికి గురిచేసేందుకు పత్రికల్లోనూ సోషల్ మీడియాలోనూ పోస్టులు పెడుతుంటారని అన్నారు. అలాంటివి నమ్మవద్దని సూచించారు. పార్టీ నిర్ణయమే అంతిమనిర్ణయంఅని, త్వరలో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థిని ప్రకటిస్తారన్నారు.

ఇరువర్గాల ఘర్షణ - పలువురికి గాయాలు

హిందూపురం, ఫిబ్రవరి 22 : సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అప్‌గ్రేడ్ ఎస్ఐ గౌరిశంకర్ తెలిపిన వివరాల మేరకు హిందూపురం మండలం దేవరపల్లికి చెందిన బోయ అరవింద్ బుధవారం రాత్రి సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ చేశాడు. ఆ పోస్ట్‌పై కురుబ మహేష్ అనే యువకుడు ప్రశ్నించాడు. దీంతో అరవింద్, మహేష్ మధ్య గొడవకు దారితీసింది. ఆ తరువాత రెండు వర్గాలవారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలు ఇటుకలతో దాడిచేసుకోగా ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో మహేష్‌వర్గంలో పవన్, అనీల్, దేవరాజు గాయపడగా... అరవింద్ వర్గంలో అరవింద్, అతడి తల్లి లక్ష్మమ్మ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఇరువర్గాలకు సంబంధించి 15మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఇరువర్గాలకు కొంతకాలంగా పాతకక్ష లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడ్డవారిని హిందూపురం ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

వైసీపీ పథకాలన్నీ కేంద్రానివే..

ప్రజాపోరు యాత్రలో బీజేపీ నాయకులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో వైసీపీ అమలు చేస్తున్న పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోనే అని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎనుమల రామకిష్ట పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాలతో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో గురువారం పెనుకొండ మండలంలోని గుట్టూరు, మునిమడుగు పంచాయతీ గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రజాపోరు యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందన్నారు. కేంద్రం సహకారంతో నిధులు తెచ్చుకుని రాష్ట్రంలో తన పథకాలంటూ స్టిక్కర్లు వేసుకుని వైసీపీ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోందని విమర్శించారు. బీజేపీ నాయకులు రవి, సుభాష్‌చంద్ర బోస్, హనుమంతుయాదవ్, మధుసుదన్, గోవిందరాజులు పాల్గొన్నారు.

ఎన్ఈపీతో చదువులకు దూరం: ఏఐఎస్ఎఫ్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 22: జాతీయ విద్యా విధానంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక సప్తగిరి కళాశాలలో విద్యార్థులతో కలిసి ప్రెస్‌నోట్ విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న జాతీయ విద్యావిధానంతో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చానని సీఎం జగన్ డబ్బా కొట్టుకుంటున్నాడని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించే వారని, మధ్యాహ్న భోజనం పెట్టేవారన్నారు. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉండేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక అవి రెండూ దూరమయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దేవరాజు, వేణుగోపాల్, వరుణ్, పవన్, కార్తీక్, మూర్తి, మంజు, వినీత్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం: రెవెన్యూ సిబ్బంది

రొద్దం, ఫిబ్రవరి 22 : మండలంలోని పెద్దగువ్వలపల్లిలో ప్రభుత్వ భూమిని ఇళ్ల పట్టాల కోసం ఆక్రమించుకోగా రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆక్రమణలు తొలగించకపోతే తామే రెండు రోజుల్లో తొలగిస్తామని హెచ్చరించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వలంటీరు కబ్జా అన్న కథనానికి స్పందించి తహసీల్దార్ లక్ష్మీనారాయణ వీఆర్‌ఓలు శ్రీదేవి, అనూష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎవరెవరు ఎంతెంత ఆక్రమించుకున్నారన్నది వివరాలు అడిగి తెలుసుకుని నోటీసులు అందించి, ఆక్రమణలు తొలగిస్తామ న్నారు. విలువైన ప్రభుత్వ భూమిని వలంటీరు, మరికొంతమంది ఇష్టారాజ్యంగా ఆక్రమించుకోవడంతో పేదలకు భవిష్యత్తులో ఇళ్ల పట్టాలకు స్థలం లేకుండా పోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములు సైతం ఇళ్ల పట్టాల కోసం ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఓ వ్యక్తి పదిసెంట్లు ఆక్రమించుకుని రూ.10లక్షలకు విక్రయించాడన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి

సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ బాల నరసింహులుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

లేపాక్షి, ఫిబ్రవరి 22: ఇళ్లులేని నిరుపేదలకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శివప్ప అన్నారు. సీపీఐ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇల్లులేని నిరుపేదలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ప్ర భుత్వ భూమి వేల ఎకరాల్లో ఉందని అధికా రులు, భూస్వాములకు కట్టబెడుతున్నారేతప్ప ఇల్లులేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే ఇల్లులేని నిరుపేదలకు ఇంటిపట్టాలు మంజూరుచేయాలని తహసీల్దార్ బాలనరసింహులుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇల్లులేని నిరుపేదలు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హార్లీ డెవిడ్సన్



ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22: ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటోకార్ప్, హార్లీ డెవిడ్సన్ సంయుక్త ఆధ్వర్యంలో హార్లీ డెవిడ్‌సన్ ఎక్స్ 440 ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగర శివారులోని వివాహ భోజనంబు గార్డెన్‌లో గురువారం రాత్రి ఏర్పాటు కార్యక్రమంలో ద్విచక్ర వాహనాన్ని నరసింహ హీరో అధినేత సునీల్ రెడ్డి, హీరో మోటో కార్ప్ ఎఎస్ఎం దీపక్, టీఎస్ఓ హనుమా ఆవిష్కరించి కస్టమర్లకు అందించారు. మొదటి రోజు 18 వాహనాలను డెలివరీ చేసినట్లు వారు తెలిపారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.2,39,500 అన్నారు. హార్లీ డెవిడ్సన్ కంపెనీ బైక్ డ్రైవ్ చేయటం ప్రతి ఒక్కరి కల అన్నారు. అటువంటి బైక్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహా హీరో షోరూం జీఎం రాకేష్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 22: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న పేర్కొన్నారు. ఆయన గురువారం మండలపరిధిలోని చందకచర్ల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మొదట ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మ్యానిఫెస్టు కరపత్రాలను అందజేశారు. అందులోని సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం చంద్రబాబు నిరంతరం కృషిచే స్తున్నారని ప్రజలకు తెలియజేశారు. మాజీ ఎంపీపీలు అశ్వత్థమప్ప, ఆదినారాయణ, మండల మాజీ కన్వీ నర్ రామాంజనేయులు, నాయకులు పాండురంగప్ప, సునీల్‌కుమార్, క్రిష్టప్ప, కారకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షిని సందర్శించిన తెలంగాణ మాజీ సీఎస్



సోమేష్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్

లేపాక్షి, ఫిబ్రవరి 22 : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా పాపనాశేశ్వ ర స్వామి ఆలయాన్ని ఉమ్మడి అనంత పురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సోమేష్ కుమార్ ఐఏఎస్ దంపతులు గురు వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శిల్ప, చిత్రకళలను సందర్శించి సంతోషం వ్యక్తంచేశారు. గతంలో ఆలయాన్ని సందర్శించామ న్నారు. ఆయన గతంలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. దుర్గా, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ నరసింహమూర్తి, ఆలయ చైర్మన్ రమానందన్ ఆయనను దుశ్శాలువలతో సత్కరించారు.

పాంచజన్య విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న విద్యార్థి ముస్తఫా

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 22: పట్టణ పరిధిలోని పాంచజన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అవార్డు అందుకున్నట్లు పాఠశాల వ్యవస్థాపకులు శ్రీనివాసులు తెలిపారు. డిసెంబరులో నిసా (నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియన్స్ ఇండియా) వారు వివిధ కేటగిరీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ముస్తఫా మొదటి స్థానంలో, 3వ తరగతి విద్యార్థి రిధాఫాతీమా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభా విద్యార్థులు బుధవారం రాత్రి ఢిల్లీలోని హయాత్ హోటల్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషనర్ జితేందర్ సింగ్, నిసా అధ్యక్షుడు శ్రీకుల భూషణ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నా రన్నారు.